అప్రకటిత విద్యుత్ కోతతో ఆందోళన

మాడుగుల రూరల్ : అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ కోతల వల్ల ప్రజలు నరకం చూస్తున్నారు. దీనికి తోడు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వక పోవడం వల్ల వ్యవసాయ మోటారు పంపుసెట్లు పనిచెయ్యక, వరినారు ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరవల్లి గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ముకుందపురం గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్‌కు పలువురు రైతులు త్రీ ఫేజ్ విద్యుత్ సమస్య గురించి తెలియజేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల వరినారు మడులు ఎండిపోతున్నాయని పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఉత్తమ సేవలకు తప్పక గుర్తింపు


నరసింహమూర్తిని దుశ్శాలువాతో సన్మానించిన జ్ఞాపికను అందిస్తున్న శ్రీనివాస్


కె.కోటపాడు : ఉపాధ్యాయునిగా ఉత్తమ ఉద్యోగ సేవలతో ప్రజల్లోను, విద్యార్థుల్లోను మంచి పేరును తెచ్చుకోవడం జరుగుతుందని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. చౌడువాడ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన పోతల నరసింహమూర్తి సన్మాన కార్యక్రమాన్ని పాఠశాలలో జరిపారు. ఈ సందర్భంగా నరసింహమూర్తికి దుశ్శాలువాను వేసి సన్మానించారు. ఉపాధ్యాయులు ఆర్.సూరిబాబు, కిలపర్తి శ్రీనివాసరావు, బొడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.

భారీ గణపతి విగ్రహం ఏర్పాటుపై పోస్టర్ ఆవిష్కరణ


చోడవరంలో భారీ విగ్రహం ఏర్పాటుపై పోస్టర్లు ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ

చోడవరం : చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి క్షేత్రంలో 63 అడుగుల ఎత్తయిన వినాయకుడి విగ్రహాన్ని నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉత్సవ కమిటీ గురువారం ఆవిష్కరించింది. చోడవరంలో ఇంత భారీ ఎత్తయిన విగ్రహం ఏర్పాటు చేయనుండడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరిపేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొప్పాక రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతటి భారీ విగ్రహాన్ని ప్రజలంతా చూసేందుకు అవసరమైన ప్రచార వాల్‌పోస్టర్లను ముద్రించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పంపిణీ చేసేందుకు కమిటీ నిర్ణయించింది.

శంకరంలో పామాయిల్ ప్లాంటేషన్


పామాయిల్ మొక్కల పెంపకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : శంకరం గ్రామంలో పామాయిల్ మెగా ప్లాంటేషన్‌ను గురువారం ప్రారంభించారు. శాంతి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సారథ్యంలో రైతు కాకర సన్యాసిరావుకు చెందిన భూమిలో ఆయిల్‌పామ్ చెట్ల పెంపకం ప్రారంభించారు. పామాయిల్ పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, ఎరువులు అందించి ప్రోత్సహిస్తుందని ఫ్యాక్టరీ మేనేజర్ పాతళం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ అసిస్టెంటు విజయదుర్గ, శంకరం, తాటిపర్తి, వీహెచ్‌ఎలు ఎస్.స్వప్న, పి. దేవి పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా సన్యాసినాయుడు


సన్యాసినాయుడుని అభినందిస్తున్న ఈశ్వరప్రసాదు

మాడుగుల రూరల్: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా కోట్ని సన్యాసినాయుడుని నియమించారు. జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరావు ఆదేశాలతో మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా సన్యాసినాయుడుని నియమించారు. ఆయనకు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దొగ్గ ఈశ్వరప్రసాద్, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వీధిలైట్ల ఏర్పాటు


లింగంపేటలో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: మండలంలో లింగంపేట పంచాయతీలో వీధిలైట్లను గురువారం పంచాయతీ పాలకులు ఏర్పాటు చేశారు. వీధుల్లో పనిచేయని లైట్లు తొలగించి సర్పంచ్ తోకల సంతోష్ కుమార్ పర్యవేక్షణలో కొత్తవి ఏర్పాటు చేశారు.

రూ.లక్షల వ్యయం... నిరుపయోగం

- తూనికయంత్రం శిథిలం
- ఆకతాయిల చేతుల్లో సీసీ కెమెరాలు ధ్వంసం


తుప్పల మధ్యలో తూనిక యంత్రం

నాతవరం : లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన తూనిక యంత్రం ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది, జిల్లాలోనే నాతవరం మండలంలో అధిక శాతం వరి పంట రైతులు సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో తాండవ రిజర్వాయరు నీటి సదుపాయం ఉండడంతో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రూ.25 వేలు నుంచి రూ.30వేలు ఎకరాల ఆయకట్టులో వాతావరణ పరిస్థితులను బట్టి వరి పంట సాగు చేస్తుంటారు. రైతులు పండించిన ధాన్యం గతంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేస్తుండడంతో అధిక మొత్తంలో ధాన్యం తూకం వేసేందుకు ఇబ్బందిపడేవారు. అలాగే చౌకదుకాణాలకు సరఫరా చేసే సివిల్ సప్లయి సరుకులు తూకం వేసేందుకు పెద్ద సమస్యగా ఉండేది. ఈ ఇబ్బందులు దృష్ట్యా గత ప్రభుత్వంలో డి.యర్రవరం పంచాయతీలో గల సివిల్ సప్లయి గోదాము ప్రాంతంలో లక్షలాది రూపాయలతో కొత్తగా తూనిక యంత్రం నిర్మించారు. ఆధునిక టెక్నాలజీతో కూడిన తూకం యంత్రం సిబ్బంది నిరీక్షణకు తీవ్రంగా ఎండ కాచినా, వర్షం పడినా ఇబ్బంది లేకుండా షెడ్డు ఏర్పాటు చేశారు. తూకం యంత్రంపై జరిపే లావాదేవీల్లో మోసం , అవకతవకలు జరగకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సీసీ


చీకటి కార్యకలాపాలకు వాడుతున్న షెడ్డు

కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో రైతుల ధాన్యం ఇతర వ్యవసాయ ఉత్పత్తులు సివిల్ సప్లయికి సంబంధించి నిత్యవసర సరుకులు సైతం ఈ యంత్రంపై తూకం వేసేవారు. రైతులకు చౌకదుకాణం డీలర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా నిర్వహణ ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూకం యంత్రాన్ని వినియోగించకుండా వృథాగా వదిలేసారు. ఏడాది కాలంగా వృథాగా వదిలేయడంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ యంత్రం కళ్ల ముందే శిథిలావస్థకు చేరుతుంది, నిర్వహణ లేకపోవడంతో బాగున్న షెడ్డు మరమ్మతులకు గురౌతుంది. ఈ తూకం కాటా గ్రామానికి దూరంగా ఉండడంతో అధికారులు పర్యవేక్షణ లేక సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు ఏర్పాటు చేసిన స్తంభాలను అల్లరిమూకలు ధ్వంసం చేశారు. పేకాట, మద్యం, ఇతర అసాంఘిక కార్యకలపాల కోసం షెడ్డు తాళాలు పగులగొట్టి వాడుకుంటున్నారు. దీనిపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతిని వివరణ కోరగా తూకం యంత్రంలో సాంకేతిక లోపం ఉండడం వల్ల వాడడం లేదన్నారు. కాటా మరమ్మతుల కోసం సంబంధితశాఖ వారికి సమాచారం ఇచ్చామని, బాగు చేశాక ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు.


ఆకతాయిలు ధ్వంసం చేసిన సీసీ కెమెరాలు

రైతులంటే మీకు లెక్కలేదా..!

- నకిలీ విత్తనాల పంపిణీ, ఎరువులు కొరతపై చర్యలేవీ
- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు


నకిలీ విత్తనాలు, ఎరువుల కొరతపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

బుచ్చెయ్యపేట : రైతులంటే అధికారులకు, ఈ ప్రభుత్వానికి లెక్కలేదని పేర్కొంటూ గతంలో ఎపుడూ లేని విధంగా నకిలీ విత్తనాలు సరఫరా చేయడమే కాక ఎరువుల కొరత సృష్టించడంపై పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల అధికారులపై మండిపడ్డారు. గురువారం బుచ్చెయ్యపేట మండల పరిషత్ మీటింగ్ హాలులో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన జరిగింది. నకిలీ విత్తనాలు సరఫరా వల్ల పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారని, గతంలో రైతు భరోసా కేంద్రాల్లో విరివిగా దొరికే యూరియా నేడు రైతు సేవా కేంద్రాల్లో ఒక్క బస్తా కూడా లేదని, పంటలు ఎలా పండించాలని వైస్ ఎంపీపీలు దొండా నారాయణమూర్తి, గొంపా చినబాబు, పెదపూడి, విజయరామరాజుపేట, కేపీ అగ్రహారం, దిబ్బిడి సర్పంచ్‌లు గోకివాడ వరక్రిష్ణ, ఎల్లపు విజయ్‌కుమార్, గోపిశెట్టి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం తదితరులు అధికారులను నిలదీశారు. దీనిపై ఈ ఏడాది ఏపీ సీడ్స్ కంపెనీ దగ్గర విత్తనాలు లేకపోవడంతో ప్రైవేటు రైతుల వద్ద ఏపీ సీడ్స్ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసి సరఫరా చేశారని ఏవో భాస్కరరావు తెలిపారు.

ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేసేసుకోవచ్చా..!

- బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలపై రగడ


వైస్‌చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ మధ్య వాగ్వాదం

నర్సీపట్నం : బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలపై మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు అధికారులను నిలదీసారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తికి సజీవ సాక్షిగా నిలిచిన బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని వైస్‌చైర్మన్లు రామకృష్ణ, అప్పలనాయుడు అధికారులను ప్రశ్నించారు. టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు కల్పించుకుని రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ చేసి సమాధుల స్థలం 19 సెంట్లేనని నిర్ధారించారని, ప్రస్తుతం చేస్తున్న నిర్మాణాలు అందులో లేవని బదులిచ్చారు. వైస్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ సమాధుల స్థలం 19 సెంట్లు కాదు, 46 సెంట్లు అని పేర్కొన్నారు. సెంటు రూ.70 లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నిర్మాణాలు చేసేందుకు కట్టిన పరదాలను తొలగించడం జరిగిందని కమిషనర్ సురేంద్ర బుదులిచ్చారు. నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. దీంతో వైస్‌చైర్మన్లు మాట్లాడుతూ ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేసుకోవచ్చని కోర్టు ఆదేశాలు ఇస్తే చూపించమని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. దీనికి అధికారులు నీళ్లు నమిలారు. మూడు నోటీసులు ఇస్తామని కమిషనర్ చెప్పారు. నిర్మాణాలు చేసుకుంటూ పోతుంటే మీరు నోటీసులు ఇస్తూ కూర్చోండని అధికారులపై మండిపడ్డారు.

క్వారీని పూర్తిగా మూసివేయాలి

వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రాపాత్రుడు డిమాండ్


దీక్షలకు సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ బాధిత దళిత రైతులు చేస్తున్న నిరాహారదీక్షలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా యర్రాపాత్రుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళిత రైతులను అన్యాయం చేస్తుందన్నారు. తొమ్మిది రోజులుగా నిరాహారదీక్షలు జరుగుతున్నా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందించకపోవటం దురదృష్టకరమన్నారు. అధికారులు సైతం వారి సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అన్యాయమన్నారు. రెవెన్యూ యంత్రాంగం మైనింగ్ మాఫియా కోసం పని చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ క్వారీని రద్దు చేయాలని పట్టుబట్టిన టీడీపీ నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే క్వారీకి అనుమతులు తెచ్చుకోవటం సిగ్గుచేటు అన్నారు. దళిత ఓట్లు కావాలి కానీ వారి గోడు పట్టించుకోరా అన్నారు. క్వారీని పూర్తిగా మూసివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళితులతో కలిసి పోటీ చేసి కూటమి నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి దీక్షలకు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో బాధితులతో పాటు బొట్టా నాగరాజు, బొంతు రమణ, మట్ల చంటిబాబు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ, స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేస్తున్న అమ్మ చారిటిబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటరావు

దేవరాపల్లి : మండలంలోని పాత వాలాబు ప్రాథమిక పాఠశాలలోని గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్ ఇతర విద్యా సామాగ్రిని అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు వితరణ చేశారు. స్థానిక పాఠశాలలో ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, హెచ్‌ఎం కె.దండుమనాయుడు, స్థానిక గ్రామ పెద్దలు చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ వెంకటరావు మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివి శత శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం హెచ్‌ఎం, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అమ్మ చారిటిబుల్ ట్రస్టు సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లెక్కల సత్యనారాయణ, రొంగలి పూజ, ఉపాధ్యాయులు అప్పారావు, పోడెల బుజ్జి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రజల మన్నన


రిటైరైన ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం జగన్నాథరావు, దుర్గాకుమారి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రోలుగుంట: విద్యార్థులకు మేలైన బోధన అందించడంతో పాటు ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ సేవలందించారని ఎంఈవో జాను ప్రసాద్, ఎంఈవో-2 శెట్టి మోహన్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదవీ విరమణ చేసిన సీనియర్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శర్మను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈవోలతో పాటు హెచ్‌ఎంలు ప్రసాద్, శేషగిరిరావు, ఉపాధ్యాయులు అప్పన రాంబాబు, ఆశోక్ సామ్రాట్, రమణ, బోనెల రాము, బండారు సూర్యనారాయణ తదితరులు దుశ్శాలువాతో శర్మ, ఆయన సతీమణి విశాలాక్షిని ఘనంగా సత్కరించారు.


పదవీ విరమణ చేసిన శర్మను సత్కరిస్తున్న నాయకులు, ఎంఈవో, ఉపాధ్యాయ సిబ్బంది

మాడుగుల : చిత్తశుద్ధితో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం తాటిపర్తి బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ ఎం సలుగు జగన్నాథరావుకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సభలో జగన్నాథరావు, దుర్గాకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. 39 ఏళ్ల పాటు ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు.

అంకిత భావంతో పని చేసే వారికి సమాజంలో గుర్తింపు


పెదనందిపల్లి హెచ్‌ఎం శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి


సన్మాన సభలో మాట్లాడుతున్న విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి

దేవరాపల్లి : విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం కూడా సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. పెదనందిపల్లిలో గురువారం జరిగిన స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దొగ్గ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించి ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. ఈ ఉద్యోగ విరమణ సన్మాన సభలో విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని హెచ్‌ఎం శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, ఎల్.కోట ఎంపీపీ గెదెల శ్రీనివాసరావు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ సేనాపతి అప్పారావు, కొత్తవలస జెడ్పీటీసీ నెక్కళ్ల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చిన్నఅబ్బాయి, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.శ్యామ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

వేచలం హెచ్‌ఎం దేవుపల్లికి ఘన సత్కారం...

వేచలం హైస్కూల్ హెచ్‌ఎం దేవుపల్లి నర్సింహమూర్తి ఉద్యోగ విరమణ సన్మాన సభ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నర్సింహమూర్తి దంపతులను జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, ఎంఈవో-2 వి.ఉషారాణి, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

రైతులకు రాయితీపై యూరియా పంపిణీ


రైతులకు యూరియా అందిస్తున్న చైర్‌పర్సన్ రామారావు

కె.కోటపాడు : పీఏసీఎస్ పరిధిలో గల సభ్య రైతులకు ఖరీఫ్‌లో రాయితీ ధరకు యూరియా అందిస్తున్నట్టు కె.కోటపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చీపురపల్లి రామారావు అన్నారు. కె.కోటపాడు సొసైటీ వద్ద గురువారం యూరియాను రైతులకు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పీఏసీఎస్ ద్వారా మొదటి విడతగా 550 బస్తాల యూరియాను అందించేందుకు సిద్ధం చేసినట్టు తెలిపారు.

ఎంపీడీవో వెంకన్నబాబుకు పదవీవిరమణ సత్కారం


ఎంపీడీవో వెంకన్నబాబు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ పైల రాజు,అధికారులు, ప్రజాప్రతినిధులు

రావికమతం: సుదీర్ఘ కాలం ఉద్యోగిగా , విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలిచారంటూ ఎంపీడీవో వెంకన్నబాబు సేవలను వక్తలు కొనియాడారు. రావికమతం మండల ఎంపీడీవోగా పనిచేస్తూ గురువారం పదవీ విరమణ చేసిన ఎంపీడీవో వెంకన్నబాబును ఎంపీపీ పైల రాజు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీల నాయకులు , ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. వెంకన్నబాబు దంపతులకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎంపీపీ రాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, వైస్ ఎంపీపీ భవానీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూర్తి, సర్పంచిల ఫోరం అధ్యక్షుడు సన్యాసినాయుడు, మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్ పూడి దేవ, సర్పంచ్ మంగ మోదినాయుడు, ఎంపీటీసీ లక్ష్మి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గోవిందరావు, కోమటి శంకర్, డిప్యూటీ తహసీల్దార్ అప్పలనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారిపై గోతుల పూడ్చివేత

రావికమతం : చీమలపాడు పంచాయితీ పరిధిలో గిరిజన గ్రామం అయన నేరేడుబందలో 60 మంది నివాసం ఉంటున్నారు. ఈ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో వివిధ రకాలగా నిరసన కార్యక్రమాలు జరిపారు. దీంతో అనకాపల్లి కలెక్టర్ డిసెంబర్ నెలలో రూ.2.50 కోట్లతో ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేశారు. అధికారులు కాంట్రాక్టర్ ద్వారా రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే బిల్లు అందకపోవడంతో రోడ్డు పనులను మధ్యలో ఆపేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గోతులు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో గిరిజనులు నడుం బిగించి శ్రమదానం చేసి గోతులు పూడ్చారు. అధికారులు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు తదితరులు కోరారు.

రూ.5 కోట్ల నీటి తీరువా వసూలు లక్ష్యం

నాతవరం : మండలంలో నీటి తీరువా పన్నులు రూ.5 కోట్లు వసూలు చేయాల్సిందని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు పరిధిలో అధికంగా ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. అందుచేత భూమి పన్నులు జిల్లాలోనే అధిక మొత్తంలో నాతవరం మండలంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమి పన్నులు వసూలు చేయాలని జాయింట్ కలెక్టరు నుంచి తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. ఇంతవరకు రూ.18 లక్షలు వసూలు చేశామని మిగిలిన పన్నులు యుద్ధప్రతిపదికన వసూలు చేయాలని వీఆర్వోలకు లక్ష్యం విధించామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

133 వితంతు పింఛన్ల మంజూరు

చీడికాడ : మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 133 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఓ హేమసుందరరావు తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న వితంతు పింఛన్లు మంజూరైయ్యాయని, 133 పింఛన్లు గాను రూ 5,32000లక్షల రూపాయులు విడుదలైనట్లు ఆయన తెలిపారు.13 సచివాలయాల్లో అప్పలరాజుపురం-11, అర్జునగిరి-12, బైలపూడి-10, చీడికాడ-11, చుక్కపల్లి-6, దిబ్బపాలెం-6, జి.కొత్తపల్లి-12, జె.బి.పురం-13, జైతవరం-9, ఖండివరం-8, కోనాం-12, శిరిజాం-10,తురువోలు-13 చొప్పున మంజూరైనట్లు ఆయన తెలిపారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు

రోలుగుంట : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ సహకారంతో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 పశువులకు పశువైద్యులు సురేష్, బాబూరావు పడాల్, సౌజన్య గర్భకోశ చికిత్సలు చేశారు. 248 గొర్రెలు, మేకలకు బలవర్ధక మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఎల్‌డీఏ జిల్లా అధికారి సౌజన్య, కోటవురట్ల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు పెట్ల నరేష్ పశువుల మేతలో మార్పు, పాడి పోషణపై అవగాహన కల్పించారు. శిబిరంలో గోపాలమిత్రలు, ట్రైనీ విద్యార్థులు సేవలందించారు.

డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తత అవసరం

మాడుగుల రూరల్ : త్రీవమైన జ్వరం, తలనొప్పితో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, వణుకు, అలసట ఉంటే డెంగ్యూ జ్వరంగా నిర్ధారించవచ్చని, కె.జె.పురం పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు జె. వెంకట్రావు పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం మాడుగుల శివారు గదబూరు గ్రామంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలు స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆనంతరం డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నివారణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భవానీ, ఎంఎల్‌హెచ్‌పి భవానీ, ఆశ కార్యకర్త చిలుకమ్మ పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయ కమిటీ సమావేశం

రోలుగుంట : మండల కేంద్రంలోని సిద్ధి వినాయక ఆలయం అభివృద్ధి, వినాయక చవితోత్సవం నిర్వహణపై సిద్ధి వినాయక సంఘం అధ్యక్షుడు మాకిరెడ్డి శ్రీను అధ్యక్షతన గురువారం సమావేశమయ్యారు. 2022లో ఏర్పాటైన ఈ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వినాయక చవితోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది సంఘ సభ్యులు గ్రామాల్లో నిర్వహించిన మేలుకొలుపుల ఆదాయం, భక్తులు పలు రూపాల్లో ఇచ్చిన సాయం, ఆలయంలో హుండీ ఆదాయం కలిపి సుమారు రూ.5 లక్షలు అని నిర్వాహకులు చదివి వినిపించారు. ఇందులో జీవకారణ్య సంఘం భవనం నిర్మాణానికి రూ.4.14 లక్షలు అప్పుగా సాయం చేయడమైందని వివరించారు. ఈ సందర్బగా వినాయక ఉత్సవానికి విగ్రహం తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని పలువురు భక్తులు పోటీపడగా, వారందరి పేర్లతో డ్రా తీయగా బొబ్బిలి రామ్మూర్తి నాయుడికి అవకాశం వచ్చినట్టు అధ్యక్షుడు మాకిరెడి శ్రీను, కార్యదర్శి సంజీవి తెలిపారు. ఉపాధ్యక్షుడు మద్దు రాజగోపి, గౌరవ అధ్యక్షుడు గొల్లు చిన్న, మద్దు శ్రీను, నిర్వాహకుడు సత్తిబాబు పాల్గొన్నారు.

జి.అగ్రహారంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మాడుగుల రూరల్ : జి.అగ్రహారం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. ఆయుర్వేద వైద్య పితామహుడు చరక జయంతి సందర్భంగా వద్దాది గ్రామానికి చెందిన విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉత్తరాంధ్ర విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.దుర్గేష్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రియాంక సారథ్యంలో 150 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. అంతకు ముందు ఈ శిబిరాన్ని ఆయనతో పాటు సర్పంచ్ నందారపు మంగమ్మ, జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొలుగొండ : మండలంలో శుక్రవారం 33 కేవీ లైన్ మరమ్మతుల కోసం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని నర్సీపట్నం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు తెలిపారు. మండలంలో గొలుగొండ, జోగుంపేట, కృష్ణదేవిపేట, సాలికమల్లవరం, పాత మల్లంపేట, పప్పుశెట్టిపాలెం, ఎర్రవరం, శ్రీరాంపురం, నర్సింగబిల్లి, చిన్నయ్యపాలెం, అమ్మపేట, రేఖపల్లి చోద్యం, లింగంపేట లింగందొరపాలెం, తదితర గ్రామాల్లో 33 కేవీ మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

నాతవరం: మండలంలో శుకవారం 33 కేవీ విద్యుత్ లైనులో చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని నర్సీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు అప్పారావు తెలిపారు. నాతవరం మండలం చినగొలుగొండపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల పెద గొలుగొండపేట, చినగొలుగొండపేట, వెదురుపల్లి, ఎస్‌బీపట్నం, గునుపూడి, పీకే గూడెం, పి.జగ్గంపేట, కొండ ధర్మవరం, చిక్కుడుపాలెం, లింగంపేట, రాజుపేట అగ్రహారం పంచాయతీలతో పాటు సరుగుడు, సుందరకొట పంచాయతీలు శివారు 16 గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

కె.కోటపాడు : ప్రజలు పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని కొరువాడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న తడి, పొడి చెత్త సేకరణను గురువారం ఆయన పర్యవేక్షించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు.